# నడక

— జయశ్రీ

సంఘంలో మన హోదా పెరిగిన తర్వాత, మనం ఇతర సామాన్య ప్రజలకంటే భిన్నమైన వాళ్ళమనీ, ప్రత్యేకమైన వాళ్ళమనీ భ్రమ పడుతుంటాం. మన సుఖాలూ జబ్బులూ కూడా అప్పుడు 'ప్రత్యేక' మైనవిగా వుంటాయి.

అంటే, 'అసామాన్యుల' మనకున్న మనం 'సామాన్యతను కోల్పోయి, 'నిర్జీవి'స్తూ వుంటే, ఇంకో వైపు సామాన్యులు కష్ట నష్టాల గతుకుల బాటల్లో నడుస్తూనే అసామాన్యులుగా, మాన్యులుగా జీవిస్తుంటారు. ఆ సత్యం తెలుసుకున్నప్పుడు మనం మనల్ని చూసి, సిగ్గుపడిపోతాం. ఆ సహజ శక్తికి ఆశ్చర్యపోతాం.

చిన్నప్పటి నుండీ బాగా నడవడం అలవాటు నాకు. స్కూలు మా యింటికి బాగా దూరంగా వుండేది. తోటి విద్యార్థులతో సరదాగా కబుర్లు చెప్పుకుంటూ నడిచి స్కూలుకి వెళ్ళి వస్తూండే వాణ్ణి.

పెద్దయాక కాలేజీలో చేరాక కూడా సైకిలు లేకపోవడంవల్ల నడిచే వెళ్ళే వాడిని. అయిదు మైళ్ళ దూరంలో వున్న కాలేజీకి, యూనివర్సిటీలో ఇంజనీరింగ్ కాలేజీలో చదువుతున్నప్పుడు కూడా రోజూ హాస్టలు నుండి కాలేజీకి నడిచే వెళ్ళేవాణ్ణి. ఇలా చదువంతా నడక మీదనే సాగింది. దానికితోడు కాస్త కాలు పొడుగు వ్యక్తి నవడంవల్ల వేగంగా నడిచే అలవాటుండేది.


అలాంటిది ఉద్యోగంలో చేరాక నడవడం తగ్గింది. పెళ్ళయాక మరీనూ! కొత్తల్లో పెళ్ళాం అలసి పోతుందనీ-తర్వాత పిల్లలు పుట్టాక వాళ్ళని యెత్తుకు నడవలేక రిక్షాలూ, ఆటోలూ. స్కూటరు కొన్న తర్వాత నడవడం బాగా తగ్గిపోయింది. ఎంతలా తగ్గిందంటే మా కంపెనీ క్వార్టర్ల నుండి అరకిలో మీటరు దూరంలో వున్న మా ఫ్యాక్టరీకి కూడా స్కూటరు మీదే వెళ్ళే వాడిని. స్కూటరు ఎలవెన్సు కూడా వస్తోందనుకోండి ఎప్పుడయినా స్కూటరు ట్రబుల్ యిస్తే, లిఫ్ట్ అడిగి మరీ ఫ్రెండ్సుతో స్కూటరు మీదో, కారులోనో వెళ్ళేవాడిని. ఇలాంటి పరిస్థితులలో వున్నట్లుండి వో రోజు నా గుండె కొద్దిగా మారాం చేసింది. డాక్టర్లూ, స్పెషలిస్టులూ మామూలే. అంతగా బెంబేలు పడాల్సినవసరం లేదనీ, రోజూ ఎక్సరు సైజుగా బాగా నడవమనీ సలహా ఇచ్చారు. చిన్నప్పుడు అవసరం వల్ల నడక. ఇప్పుడు ఆరోగ్యం కోసం నడక. 'ఈవెనింగ్ వాక్' మొదలుపెట్టి క్రమ క్రమంగా రోజూ నాల్గయిదు కిలో మీటర్లు నడిచేవాడిని. ఆరోగ్యం మెరుగయింది బాగానే.

ఓ రోజు అత్యవసరంగా చాలా పనులున్నాయని ఆఫీసుకి సెలవు పెట్టాను. మధ్యాహ్నానికల్లా ముఖ్యమైన పనులన్నీ పూర్తిచేసుకుని ఇంటికి చేరి భోజనం చేసి కాసేపు నడుం వాల్చాను. లేచేసరికి మిగిలిన ఒక పని గురించి గుర్తు చేసింది మా ఆవిడ, మా మరదలుకి సంబంధం గురించి ఒకరిని కలవాలని. గబగబా తయారయి, కాఫీ తాగి స్కూటరు తీసాను. ప్రొద్దుటి నుండి తిరిగి తిరిగి అలసి పోయిందేమో మరి స్కూటరు కదలనని మొరాయించింది. ఎవరయినా ఫ్రెండ్సుని అడుగుదామంటే ఇంకా ఫ్యాక్టరీ నుండి యెవరూ రాలేదు. నేను వెళ్ళాల్సిన గోపాలపట్నం అక్కడికి రమారమి ఎనిమిది, తొమ్మిది కిలోమీటర్లుంటుంది. తప్పని పరిస్థితుల్లో సిటీ బస్సు యెక్కి గోపాలపట్నం వెళ్ళాను. పెళ్ళి వారింటికి వెళ్ళి సంబంధం గురించి మాట్లాడాను. వాళ్ళు కాస్త సుముఖంగానే కన్పించారు. మాటలయాక వాళ్ళ దగ్గర సెలవు తీసుకుని మళ్ళీ బస్సు కోసం నిలబడ్డాను. ఎంతకీ బస్సు రావడం లేదు. అంతలో నాకో అయిడియా వచ్చింది. ఎలాగూ సాయంత్రం అవుతోంది కదా! చల్లగానే వుంది యింటికి నడిచి వెడితే నా యీవెనింగ్ వాక్‌లాగా కూడా వుంటుంది, పుణ్యం పురుషార్థం కలిసి వస్తాయనిపించింది. మళ్ళీ తొమ్మిది కిలో మీటర్లు నడవాలే అనిపించినా,



ఆ రోజు అనుకున్న పనులన్నీ సరిగ్గా జరిగిపోవడంతో మంచి మూడ్‌లో వున్నానేమో, సాహసించి ఇంటికి నడవడం మొదలు పెట్టాను.

ఆ రోడ్డు హైవే కావడంవల్ల వచ్చే పోయే వాహనాలతో బాగా రద్దీగా వుంది. మళ్ళీ అయిదు కిలోమీటర్ల వరకూ ఇళ్ళేమీ లేకపోవడంవల్ల రోడ్డు మీద నడిచి వెళ్ళే వాళ్ళెవరూ లేరు. రోడ్డు మీద నడుస్తున్న వాడిని నేనొక్కడినే. ఇద్దరు ముగ్గురు స్కూటరు మీద వెడుతున్న వారు లిఫ్ట్ ఆఫర్ చేశారు.‘ థ్యాంక్స్! వద్దని చెప్పి ముందుకు నడక సాగించాను. దాదాపు సగం దూరం నడిచే సరికి కొద్దిగా అలసటగా అనిపించింది. అందులోనూ ఒంటరిగా నడుస్తున్నానేమో ఇంకాస్త బోరుగా వుంది. ఇంకొద్ది దూరం నడిచే సరికి దూరంగా అయ్యప్ప స్వామి గుడి కనిపించింది. అక్కడికి చేరితే పక్కనే షీలానగరు. తర్వాత అక్కిరెడ్డిపాలెం, తర్వాత మా ఫ్యాక్టరీ క్వార్టర్లు. ఇంక నడవాల్సిన దూరం ఎంతో లేదని సంతోషపడుతూ నడక వేగం పెంచాను. ఇంతలో నాకు కొద్ది దూరంలో ఇంకో వ్యక్తి కనిపించాడు, నేను వెళ్ళే వైపే నెమ్మదిగా నడుస్తూ మాట్లాడుతూ నడిస్తే అలుపు తెలియదని గబగబా నడిచి అతడిని సమీపించాను. దగ్గరగా వెళ్ళి ఆ వ్యక్తిని చూద్దునుగదా బాగా చిరిగిన మురికి బట్టలు, తైల సంస్కారం లేని జుట్టు చెప్పులు లేని కాళ్ళు, బాగా దుమ్ముకొట్టుకుని వున్నాడు. స్టేటస్సు అడ్డం వచ్చి పలకరించ బోయిన వాడిని ఆగిపోయాను. ఇంతలో ఇద్దరం అయ్యప్ప స్వామి గుడిని సమీపించాము. “బాబూ! యిదేం గుడి?” అని అడిగాడా వ్యక్తి.‘ అయ్యప్ప గుడని ముక్తసరిగా జవాబిచ్చాను. “అంటే!” అని ఆశ్చర్యంగా అన్నాడు. “రాముడు, కృష్ణుడు, శివుడు, హనుమంతుడు వీళ్ళందరి గుడులూ చూసాను. కానీ ఈ దేవుడి పేరే వినలేదే! ఈయనెవరు?” అని ఆశ్చర్యంగా అన్నాడు. నాకున్న పాండిత్యం అంతా వలకబోసి అయ్యప్ప స్వామిని గురించి తెలియజెప్పాను. చివర్లో అన్నాను. “రోజూ పూర్తిగా నల్లటి బట్టలు వేసుకుని, నుదుట గంధం బొట్టు పెట్టుకుని, కాళ్ళకు చెప్పులు లేకుండా కనిపిస్తారే! వాళ్ళంతా ఈ స్వామి భక్తులే” అని. అతనేదో అర్థమయినట్టు తలూపాడు. నేను ముందు అతన్తో మాట్లాడనవసరం లేకుండా అతనే నాతో మాట్లాడినందుకూ, ఆ సందర్భంగా నా తెలివిని ప్రదర్శించుకోగలిగినందుకూ నా అహం తృప్తిపడిందేమో మాట కలిపాను. ‘ఎక్కడ నుండి వస్తున్నావ’ని అడిగాను. ‘మర్రిపాలెం నుండ’ని సమాధానం ఇచ్చాడు. అక్కడికి కనీసం పది కిలోమీటర్లుంటుందా మర్రిపాలెం. “ఎక్కడి వరకూ?” అని అడిగాను. “బాల చెరువు వరకూ” అన్నాడు. ఇంకో పదిహేను కిలో మీటర్లు వెడితేనేకానీ ఆ బాల చెరువు రాదు. కొద్ది దూరంలో వున్న పెట్రోలు బంకు చూపిస్తూ “అక్కడ నించుంటే బాల చెరువు వెళ్ళే బస్సు వస్తుంది. ఎక్కి వెళ్ళ”మని సలహా ఇచ్చాను.



“లేదు, నడిచే వెడతా”నన్నాడతను ముక్తసరిగా. అదిరి పడ్డాను నేను. అక్కడికి ఇంకో పదిహేను కిలోమీటర్లుంటుంది బాల చెరువు. అంటే మొత్తం యిరవై అయిదు కిలోమీటర్లు నడుస్తాడన్నమాట! తొమ్మిది కిలోమీటర్లు నడవబోతున్నందుకేఎంతో గర్వంగా ఫీలవుతున్న నాకు చిన్నతనంగా అనిపించింది. మళ్ళీ అతనితో అన్నాను.

“అంత దూరం నడిచి యెందుకు వెళ్ళడం? ఇంకాసేపట్లో చీకటి పడ్తుంది. అటువంటప్పుడు యెందుకీ ప్రయాణం? రేపు ప్రొద్దున్నే బస్సులో వెళ్ళ వచ్చుగదా!” అని ఓ ఉచిత సలహా పడేసాను.

“కాదు సామీ! నేనుండేది బాల చెరువే. రాత్రి మా చుట్టాలతను పోయాడని తెలిసి మర్రిపాలెంలో వున్న వాళ్ళింటికి వెళ్ళి చూసి వస్తున్నాను. పొద్దున కూడా నడిచే వెళ్ళాను. వచ్చిన పని అయిపోయిందిగదాని యిప్పుడు మా ఇంటికి తిరిగి పోతున్నాను” అన్నాడు.

“భోజనమయినా చేశావా? మరీ నీరసంగా కనిపిస్తున్నావు” అని అడిగాను.

“చచ్చిన మనిషిని తగల బెట్టడానికే డబ్బు లేదు మా వాళ్ళదగ్గర. చూడ్డానికి వచ్చిన వాళ్ళందరికీ కూడు గూడా పెట్టగలరా? పైగా నేనే నా దగ్గరున్న పది రూపాయిలు దానానికని (దహనం) యిచ్చి వస్తున్నాను, నిన్నటి కూలి డబ్బుల్లో మిగిల్చినవా పది రూపాయిలు. ఎందుకయినా మంచిదని తీసికెళ్ళాను నాతో. ఆవిధంగా వుపయోగ పడింది. అందుకే నడిచే వెడుతున్నాను యిప్పుడు గూడా. ఎలాగూ ఇంటికి వెడతాను గదా! అప్పుడే యింత యెంగిలి పడ్తాను”అన్నాడు.

మధ్యాహ్నం మా పెద్దాడు కూర నచ్చలేదంటూ కలిపి పారేసిన కంచం కూరన్నం నా కళ్ళముందు వెక్కిరిస్తూ కదలాడింది. “పోనీ! అంత దూరం ఆకలి కడుపుతో నడిచి యెలా వెడతావు? దారిలో శోష వచ్చే ప్రమాదం వుంది. నేను డబ్బులిస్తాను. ఆ జంక్షన్‌లో వున్న హోటల్‌లో నాల్గిడ్లీలు తిని మరీ వెళ్ళు” అన్నాను. ఆపదలో వున్న వాళ్ళకు సహాయ పడిన అతని స్వభావం నన్ను ఆకర్షించింది. మొదట్లో కలిగిన చులకన భావం పోయింది. దానికతను ఎంత మాత్రం ఒప్పుకోలేదు. ఇంటి దగ్గర వాళ్ళావిడ భోజనం చేయకుండా ఇతని కోసం యెదురు చూస్తూ వుంటుందట. అందువల్ల

ఏమీ తినలేదన్నాడు. అతని సమాధానం విన్న నాకు నోట మాట రాలేదు. అతని వ్యక్తిత్వం మీద యెనలేని గౌరవం కలిగింది. దాన్తోపాటు అతడికి ఎలాగయినా సహాయం చేయాలనిపించింది. ''పోనీ బస్సు టిక్కెట్టుకి డబ్బులిస్తాను. బస్సులో వెళ్ళు. త్వరగా వెడతావు. కనీసం మీ ఆవిడా నువ్వూ కలిసి త్వరగా అన్నం తినవచ్చు'' అన్నాను. దానికీ అతనెంతమాత్రం ఒప్పుకోలేదు. బలవంతంగా అతని చేతిలో అయిదు రూపాయిలుంచాను. ఇలా మాట్లాడుతూ రావడంతో మా ఫ్యాక్టరీ క్వార్టర్ల వరకూ వచ్చేసాం మాకు తెలియకుండానే. అక్కడే వున్న బస్సు స్టాపులో అతడిని వదిలి నేను మా క్వార్టర్స్ వైపు నడిచాను. అక్కడ రోడ్డు మీదే వున్న పళ్ళ దుకాణంలో పళ్ళు బేరం చేసి కావలసినవి తీసుకుని ప్యాక్ చేయమన్నాను. పర్సులో నుండి ఏభయి రూపాయిల నోటు తీసి దుకాణం అతనికి ఇవ్వబోతూ యథాలాపంగా బస్సు స్టాపు వైపు చూసాను. అతను బస్సు స్టాపులో లేదు. చూస్తే మళ్ళీ నడుస్తూ కన్పించాడు. పళ్ళ కొట్టతనికి యిప్పుడే వస్తానని చెప్పి చేతిలో వున్న ఏభయి రూపాయిల నోటుతో అలాగే గబగబా అతని వైపు అడుగులు వేసి పిలిచి ఆపాను. దగ్గరగా వెళ్ళి ''ఏమిటయ్యా! బస్సులో వెళ్ళమని డబ్బులిస్తే మళ్ళీ నడిచి వెడుతున్నావు?'' అనడిగాను కొంత ఆశ్చర్యంగా, కొంత చిరాగ్గా.

దానికతడు ''బాబుగారూ! మీరేమీ అనుకోనంటే ఓ విషయం చెపుతాను. నిన్న కూలి డబ్బుల్లో మిగిలిన పది రూపాయిలూ మా వాళ్ళకిచ్చేసాను. ఇంటి దగ్గర డబ్బు లేదు. రోజు కూలీవాళ్ళం. రెక్కాడితే గానీ డొక్కాడదు. ఇవాళ కూలీ కెళ్ళలేదు గాబట్టే మళ్ళీ రేపు రాత్రి దాకా ఎలా గడపాలో తెలియట్లేదు. మీరు బస్సు కోసం యిచ్చిన అయిదు రూపాయల్తో మేం ఇవాళ రాత్రి, రేప్పొద్దున్న కాస్త గంజి తాగవచ్చు. కడుపు మీద స్వార్థంతో బస్సులో వెళ్ళకుండా నడిచే వెడదామనుకున్నాను. క్షమించండి'' అన్నాడు. సరిగ్గా ఇవే మాటలు గాకపోయినా ఈ అర్థంతోనే ఆయన చెప్పాడు.

నా కళ్ళల్లో గిర్రున నీళ్ళు తిరిగాయి. అతడి నిజాయితీకీ, నిస్వార్థానికీ తలవంచి దండం పెట్టాలనిపించింది. అప్రయత్నంగా చేతిలో వున్న ఆ యాభై రూపాయిల నోటూ అతని చేతిలో వుంచాను. ''ఈ డబ్బు తీసుకో. అవసరానికి పనికి వస్తుంది. ప్రస్తుతానికి ఈ మాత్రం సాయం మటుకు చేయగలను'' అన్నాను ఆవేశంగా. అతను వెంటనే ఆ డబ్బు తిరిగి నా చేతిలో వుంచాడు.

''బాబుగారూ! మీ గొప్ప మనసుకి దండాలు. మీరు బస్సు కోసమని యిచ్చిన డబ్బు తిండి గింజల కోసం ఖర్చు వేద్దామనుకున్నాను. మీరు చేసిన ఆ సాయం చాలు. ఇలా మళ్ళీ, అవసరానికి మించి యింత డబ్బు యిస్తే బద్ధకించి నేను రెండ్రోజులు కూలి పని మానేసే ప్రమాదం వుంది. అలా బద్ధకం బలిస్తే అది నాకూ, నా కుటుంబానికీ మంచిది కాదు. మీరిచ్చిన ఈ ఏభయి రూపాయిలు వద్దంటున్నందుకు క్షమించండి. సెలవు. వస్తాను'' అంటూనే నెమ్మదిగా అడుగులేస్తూ వెళ్ళిపోయాడు.

నోట మాట రాక, అడుగు ముందుకు పడక, నడక ఆగిపోయి నిస్తేజుడినై అతడి వంకే చూస్తూ నిలబడిపోయాను. అతడలాగే వెళ్ళిపోతున్నాడు. నాకంటే వయసులో పెద్దవాడైనా అతను అంత దూరం ఎలా నడవగలుగుతున్నాడో, నేను చిన్నవాణ్ణయినా అన్నివిధాలా అతనికంటే మెరుగ్గా వున్నా ఎందుకు నడవలేక పోతున్నానో అర్థమయింది.

